సాక్షి నల్లగొండ

మంగళవారం ; 28 ; మే ; 2024



బైక్ దొంగల ముఠా అరెస్టు
బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న అంత ర్రాష్ట్ర ముఠాను నల్లగొండ పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో



వీడిన హత్య కేసు మిస్టరీ
నందికొండ వెంకన్న అలియాస్ వెంకటేష్ అనే యువకుడి హత్య కేసును పోలీసులు ఛేదించారు. - 8లో



వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పాత పెన్షన్ సాధనే లక్ష్యంగా పోరాటం



మాట్లాడుతున్న నాగవెల్లి ఉపేందర్

నల్లగొండ టూటౌన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ సాధనే లక్ష్యంగా పోరాడుతున్నామని తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాగవెల్లి ఉపేందర్ అన్నారు. సోమవారం నల్లగొండలో నిర్వహించిన సంఘం జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిర్యాలగూడలో ఒక రిటైర్డ్ ఉద్యోగి అనారోగ్యంతో చనిపోతే అంత్యక్రియలకు చందాలు వసూలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన ఉద్యోగి ఉపేందర్‌పై ఆధారపడిన కుటుంబ సభ్యులను ఆదుకోవడం కోసం ఉద్యోగ, ఉపాధ్యాయులంతా స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. ప్రభుత్వం వెంటనే పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకుడు కేదారి ప్రభాకర్, శేఖరయ్య పాల్గొన్నారు.

మట్టపల్లి హుండీల ఆదాయం రూ.16.52లక్షలు



హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

మఠంపల్లి: మట్టపల్లి దేవస్థానం హుండీలను సోమవారం ఆలయ పాలకవర్గం, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆధ్వర్యంలో లెక్కింపు చేపట్టినట్టు ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్ తెలిపారు. 65రోజులకుగాను హుండీల ద్వారా రూ.12,49,936 సమకూరగా, అన్నదానం హుండీకి రూ.47,310, కల్యాణ హుండీల ద్వారా రూ3,55,340తో కలిపి మొత్తం రూ.16,52,586 ఆదాయం వచ్చినట్టు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, సాయిసేవా సంఘం సభ్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

క్యూలైన్లలో సౌకర్యాలు కల్పించాలి



క్యూలైన్‌లో భక్తులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న ఈఓ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రానికి భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో సమస్యలు తలెత్తకుండా సౌకర్యాలు ఉండాలని ఆలయ ఈఓ భాస్కర్‌రావు అధికారులను ఆదేశించారు. సోమవారం క్యూ కాంప్లెక్స్, గోల్డ్ క్యూలైన్లు, అష్టభుజి ప్రాకారంలోని క్యూలైన్లను ఆయన పరిశీలించారు. భక్తులు ఎంత మంది వచ్చినా క్యూలైన్లలో ఇబ్బందులు తలెత్తవద్దన్నారు. అలాగే క్యూలైన్లలో నిల్చున్న భక్తులతో మాట్లాడి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకున్నారు.

మహాశివుడికి అభిషేకాలు



శివాలయంలో స్పటిక లింగానికి పూజలు చేస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట : యాదాద్రి కొండపై ప్రధానాలయానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో సోమవారం రుద్రాభిషేకం, బిల్వార్చన పూజలు ఘనంగా నిర్వహించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక ప్రధానాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవ, అనంతరం అభిషేకం, అర్చనలు చేశారు. అలాగే ఆలయ ముఖ మండపం, ప్రాకార మండపాల్లో సుదర్శన నారసింహ హోమం, నిత్యకల్యాణం, జోడు సేవోత్సవం తదితర కైంకర్యాలు గావించారు.



నల్లగొండలోని సెయింట్ ఆల్ఫోన్సెస్ పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు బారులు తీరిన పట్టభద్రులు

పట్టభద్రుల పోలింగ్ 66.75%

- ప్రశాంతంగా ముగిసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటింగ్
- గత ఎన్నికల కంటే తగ్గిన పోలింగ్ శాతం
- ఓటేసేందుకు పెద్దగా ఆసక్తి కనబర్చని గ్రాడ్యుయేట్లు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : వరంగల్ - ఖమ్మం - నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సోమవారం జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో సాయంత్రం 4 గంటల వరకు 66.75 శాతం పోలింగ్ నమోదైంది. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి పోలింగ్ శాతం తగ్గిందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. జిల్లాలో 80,871 మంది ఓటర్లు ఉండగా, 53,981 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నార్కట్‌పల్లిలో తోపులాట

నల్లగొండ జిల్లాలో 97 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఒక చోట మినహా మరెక్కడా ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాలేదు. నార్కట్‌పల్లిలో కాంగ్రెస్ కార్యకర్తలు డబ్బులు పంచుతున్నారని ఆరోపిస్తూ స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్‌గౌడ్ అక్కడికి వెళ్లగా తోపులాట జరిగింది. ఆ తరువాత తమపై దాడి చేశారంటూ నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట అశోక్ ధర్నాకు దిగారు. దీంతో పోలీసులు ఆయనకు రక్షణ కల్పించారు. ఇది మినహా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు.

పోలింగ్ సరళి ఇలా

ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మొదటి రెండు గంటల్లో మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో 11.34 శాతం పోలింగ్ నమోదు కాగా.. ఒక్క నల్లగొండ జిల్లాలో మాత్రం 9.95 శాతం నమోదైంది. అదే విధంగా 12 గంటలకు మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో 29.30 శాతం పోలింగ్ నమోదు కాగా నల్లగొండ జిల్లాలో మాత్రం 26.94 శాతం నమోదైంది. అదే విధంగా మధ్యాహ్నం 2 గంటలకు మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో 49.53 శాతం పోలింగ్ నమోదు కాగా ఒక్క నల్లగొండ జిల్లాలో మాత్రం 47.44 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ ముగిసే సమయం వరకు నియోజకవర్గం మొత్తంలో 68.65 శాతం పోలింగ్ నమోదు కాగా, నల్లగొండలో 66.75 శాతం పోలింగ్ నమోదైంది.

ఆసక్తి చూపని పట్టభద్రులు

2021లో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు పెద్ద ఎత్తున ఓటు హక్కును వినియోగించుకున్నారు. కానీ, ఎన్నికల్లో మాత్రం గ్రాడ్యుయేట్లు పెద్దగా ఆసక్తి చూపలేదు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల పరిధిలోని 12 కొత్త జిల్లాల్లో గతంలో 76.36 శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈసారి 68.65 శాతమే పోలింగ్ నమోదైంది. నల్లగొండ జిల్లాలోనే ఇదే పరిస్థితి ఉంది. నల్లగొండ జిల్లా కేంద్రంతో పాటు కొన్ని మరికొన్ని చోట్ల కొత్తగా ఓటు హక్కు వచ్చిన పట్టభద్రులతో పాటు రిటైర్డ్ ఉద్యోగులు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేశారు. మహిళలు ఎక్కువగా పోలింగ్‌లో పాల్గొన్నారు.



నల్లగొండ డైట్ స్కూల్‌లో చంటిపాపతో వచ్చి ఓటు హక్కు వినియోగించుకుంటున్న మహిళ

ఓటర్లకు డబ్బు పంపిణీ!

పోలింగ్ సందర్భంగా ప్రధాన పార్టీలకు చెందిన కొందరు డబ్బులు పంపిణీ చేస్తున్నారన్న ప్రచారం జరిగింది. ఒక పార్టీ వారు ఓటుకు రూ.500 ఇస్తే మరో పార్టీ వారు రూ.300 ఇచ్చారని, ఇంకో పార్టీ వారు డబ్బులు వచ్చినా ఓటర్లకు పంచలేన్న చర్చ జోరుగా సాగింది.



ఎన్జీ కాలేజీలోని పోలింగ్ కేంద్రంలో ఓటర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన



4 గంటల తర్వాత పోలింగ్ కేంద్రం లోపల ఉన్న ఓటర్లకు టోకెన్లు అందజేస్తున్న ఎన్నికల సిబ్బంది



నల్లగొండలోని బోయవాడ పోలింగ్ కేంద్రంలో బ్యాలెట్ బాక్స్‌కు సీలు వేస్తున్న అధికారులు

మహిళల రక్షణకు కమిటీలు

- పని ప్రదేశంలో వేధింపులను అరికట్టేలా ప్రభుత్వ నిర్ణయం
- కమిటీల ఏర్పాటుకు అధికారుల కసరత్తు

మిర్యాలగూడ టౌన్ : పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులను అరికంట్టేందుకు అంతర్గత మహిళా కమిటీలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ప్రధానంగా మహిళా ఉద్యోగులపై వేధింపులు జరుగుతున్నట్లు రాష్ట్ర వ్యాప్తంగా ఆరోపణలు వస్తుండడంతో ఈ నిర్ణయం తీసుకుంది. మహిళా ఉద్యోగుల రక్షణపై ప్రత్యేక దృష్టి పెడుతోంది. మున్సిపాలిటీల్లో అంతర్గత మహిళా కమిటీలను ఏర్పాటు చేయాలని ఏప్రిల్ 29న మున్సిపల్ శాఖ సంబంధిత మున్సిపల్ అధికారులకు ఉత్తర్వులను జారీ చేసింది. అయితే మొన్నటి వరకు లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో అధికారులు పూర్తిగా నిమగ్నం కావడంతో కమిటీల ఏర్పాటుపై ముందడుగు పడలేదు. ఇప్పుడు ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడంతో అంతర్గత మహిళా కమిటీలు వేసేందుకు మున్సిపల్ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.



వేధింపులు తగ్గే అవకాశం..

మున్సిపాలిటీల్లో వివిధ హోదాల్లో మహిళా ఉద్యోగులు, కార్మికులు విధులు నిర్వర్తిస్తుంటారు. ప్రస్తుతం ఏర్పాటు చేయనున్న అంతర్గత కమిటీలు వారి రక్షణకు కృషి చేయనున్నాయి. మహిళా ఉద్యోగులపై ఎవరైనా వేధింపులకు పాల్పడితే ఈ కమిటీ విచారణ చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా చూస్తుంది. వేధింపులకు కారకులైన వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తుంది. ప్రభుత్వ నిర్ణయం వల్ల మహిళలపై వేధింపులు తగ్గి, వారికి పూర్తిస్థాయిలో రక్షణ లభిస్తుందని పలువురు పేర్కొంటున్నారు.

కమిటీల్లో ఎవరెవరు ఉంటారంటే..

మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేసే అంతర్గత మహిళా కమిటీల్లో సీనియర్ మహిళా ఉద్యోగిని ప్రిసైడింగ్ అధికారిగా నియమించాలి. సీనియర్ ఉద్యోగిని లేకపోతే ఇతర ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఒక సీనియర్ మహిళా ఉద్యోగిని ఎంపిక చేసి బాధ్యతలు అప్పగించాల్సి ఉంటుంది. మరో ఇద్దరిని సభ్యులు మహిళా చట్టాలపై అవగాహన, సామాజిక సేవలో చురుకుగా పాల్గొనే వారిని, మహిళా సమస్యలపై పోరాడే వారిని ఈ కమిటీలో ఎంపిక చేయనున్నారు.

ఈ నెలాఖరులోగా కమిటీ ఏర్పాటు



మున్సిపాలిటీలో వేధింపులను అరికట్టేందుకు మహిళా కమిటీలను ఏర్పాటు చేయాలని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ డ్మినేషన్ ఐఏఎస్ అధికారి డి.దివ్య ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఎన్నికల కారణంగా కమిటీని ఏర్పాటు చేయలేకపోయాం, ఈ నెల చివరిలోగా కమిటీని ఏర్పాటు చేస్తాం.

– మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

రాష్ట్రంలో పోలీస్ రాజ్యం నడుస్తోంది

- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

నల్లగొండ : రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని, పోలీసు రాజ్యమే నడుస్తోందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ సందర్భంగా నల్లగొండలోని ఎన్జీ కాలేజీ పోలింగ్ కేంద్రం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి ఓటమి భయం పట్టుకుని దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. ఎలాగైనా గెలవాలని ఓటర్లకు డబ్బులు పంచుతూ ప్రలోభాలకు గురిచేసిందన్నారు. కానీ, ఈ ఎన్నికల్లో పట్టభద్రులు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు నడుం బిగించారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతు పెరిగిందన్నారు. పోలీసులు కూడా నిష్పక్షపాతంగా నడుచుకోవాలని సూచించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, రావుల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

బైపాస్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలి

నల్లగొండ రూరల్ : నల్లగొండ పట్టణ శివారు నుంచి నిర్మించే బైపాస్ రోడ్డును మున్సిపాలిటీ శివారు నుంచి ఏర్పాటు చేయాలని దేవరకొండ రోడ్డులోని పలువురు నివాసాల వాసులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. మర్రిగూడ బైపాస్ నుంచి గిరకబాయిగూడెం మునుగోడు రోడ్డులోని రాఘవేంద్ర డిగ్రీ కాలేజీ, శ్రీఆంజనేయ గార్డెన్, సాగర్ రోడ్డులోని చర్లగౌరారం స్టేజీ వద్ద కలిపే లింక్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చాలని కోరారు. రోడ్డు నిర్మాణానికి శాంపిల్ పరీక్షలను చేసే వారిని అడ్డుకున్నారు. శాంపిల్ పరీక్షలు చేసే మిషన్‌ను నిలిపివేశారు. అయితే ఇంకా అలైన్‌మెంట్ ఖరారు కాలేదని కేవలం సర్వే మాత్రమే చేస్తున్నామని జాతీయ రహదారుల డీఈ రాజశేఖర్ వారికి వివరించారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా తమకు ఫిర్యాదు అందించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సైదులుగౌడ్, జేఎం మారయ్యగౌడ్, ముజీబ్, శ్రీకాంత్, యాదయ్య ఉన్నారు.



మిషన్ వద్ద నిరసన తెలుపుతున్న ప్రజలు

సంఘ్ పరివార్ శక్తులను పెంచిపోషిస్తున్న బీజేపీ

- వీక్షణం సంపాదకుడు వేణుగోపాల్



మిర్యాలగూడ టౌన్ : ఫాసిజం, నాసిజం కొనసాగింపుగా సంఘ్ పరివార్ శక్తులను బీజేపీ పెంచిపోషిస్తోందని వీక్షణం సంపాదకుడు వేణుగోపాల్ ఆరోపించారు. సోమవారం రాత్రి మిర్యాలగూడ పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో ఉపాధ్యాయ నేత శేషు సంస్మరణ సభ సందర్భంగా 'పెరిగిపోతున్న ఫాసిజం ప్రమాదం' అనే అంశంపై ఆయన మాట్లాడారు. 1979లో ఆర్ఎస్ఎస్ శక్తులు శేషుపై హత్యాయత్నం చేశారని తెలిపారు. 45 ఏళ్ల క్రితమే శేషు విద్వేషపూరితమైన భావజాలాన్ని చీల్చి చెండాడని పేర్కొన్నారు. 1997 మే 12న గుండెపోటుతో మృతి చెందిన శేషు.. ఉపాధ్యాయుడిగానే కాకుండా దుర్మార్గాన్ని, దోపిడీ సమాజపు దురంతాలను తూర్పార పట్టిన ప్రజాస్వామిక వాది అన్నారు. దేశంలో అన్ని మతాలు సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తే, హిందూ ఫాసిజం మాత్రం అసమానతలు సృష్టించిందన్నారు. రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, ప్రజాస్వామిక హక్కులను రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ముస్లిం విద్యావంతుల వేదిక నేత మౌజం హుస్సైన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ సీడీ రవికుమార్, డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య, విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, విరసం సభ్యులు వెంకన్న, భిక్షమయ్య, కృష్ణ, సైదులు, హరి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ టీచర్లకు కనీస వేతనం ఇవ్వాలి

సూర్యాపేట టౌన్: ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులకు కనీస వేతనం అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సామాజిక అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్, న్యాయవాది లింగంపల్లి భద్రయ్య అన్నారు. సోమవారం సూర్యాపేటలోని డీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ విద్యాలయాల యజమానులు తమ అభ్యున్నతికి తోడ్పడుతున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులకు నెలకు రూ.25వేలకు తక్కువ కాకుండా వేతనాలు చెల్లించాలన్నారు. ప్రతినెలా ఒక సెలవు మాత్రమే ఇస్తున్నారని, రెండు అమలు చేయాలని కోరారు. వేదిక కో కన్వీనర్ రేపాక లింగయ్య మాట్లాడుతూ ప్రైవేట్ ఉపాధ్యాయులకు కూడా ప్రావిడెంట్ ఫండ్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆకస్మికంగా మరణించిన ప్రైవేట్ ఉపాధ్యాయులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వేదిక సభ్యులు చామకూరి నర్సయ్య, అబ్దుల్ కరీం, నారబోయిన వెంకట్ యాదవ్, జి.ఆనంద్ భాస్కర్, నకిరేకంటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌ను నిర్మూలించాలి

మునగాల(కోదాడ): యువత జీవితాలను నాశనం చేస్తున్న గంజాయ, డ్రగ్స్, మత్తు పదార్థాలను పూర్తిస్థాయిలో నిర్మూలించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ కోరారు. సోమవారం మునగాల మండల కేంద్రంలోని సుందరయ్య భవనంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కాసాని కిశోర్ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటి యువత గంజాయి, డ్రగ్స్‌కు బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి గడ్డం వినోద్, మండల నాయకులు దేవరం శ్యాం సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న కూరగాయలు

- సామాన్యులకు అందనంతగా పెరిగిన ధరలు
- వేసవికావడంతో తగ్గిన దిగుబడి
- రేట్లు అమాంతం పెంచుతున్న వ్యాపారులు

నల్లగొండ టౌన్ : కూరగాయల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఏ కాయగూర అయినా పావు కిలో (250గ్రాములు) రూ.20 వరకు అమ్ముతున్నారు. . దోస, టమాట, కాకర, బెండ, బీర, గోకర, ఆలుగడ్డ, వంకాయ ఇలా ఏ కూరగాయ అయినా కిలో రూ.80 వరకు అమ్ముతున్నారు. ఇక పచ్చిమిర్చి పావుకిలో రూ.30 వరకు అమ్ముతున్నారు. బీన్స్ ఏకంగా కిలో రూ.300 నుంచి రూ.350 వరకు పలుకుతోంది. ఇలా ప్రతి కూరగాయ రేటు పెరగడంతో సామాన్యులు కొనలేని పరిస్థితి దాపురించింది. కూరగాయలు ధరలు మండుతున్నాయని.. పప్పులు వండుకుందామన్నా.. వాటి ధర కూడా ఆకాశాన్నంటుతోంది. వేసవి కావడంతో చికెన్ రేటు కూడా కిలో రూ.220 పైనే ఉంది. దీంతో నిత్యం కూలినాలీ చేసుకునే ప్రజలు కారం, పచ్చళ్లతో సరిపెట్టుకుంటున్నారు.



నల్లగొండలోని ప్రకాశం బజార్ కూరగాయల మార్కెట్

వ్యాపారి చెప్పిందే రేటు..

వేసవి కావడంతో కూరగాయల దిగుబడి తగ్గింది. దీంతో మార్కెట్‌కు కూరగాయలు కూడా పెద్దగా రావడం లేదు. వచ్చే కొన్ని కూరగాయలను మార్కెట్‌లో వ్యాపారులు రైతుల వద్ద నుంచి తక్కువ రేటుకు కొనుగోలు చేసి.. వినియోగదారులకు మాత్రం ఎక్కువ రేటుకు అమ్ముతున్నారని కొనుగోలుదారులు ఆవేదన చెందుతున్నారు.

కూరగాయల ధరలు (కిలో.. రూలలో)

కూరగాయ	హోల్‌సేల్	రిటైల్
టమాట	40	60
దోస	50	70
కాకర	80	100
పచ్చిమిర్చి	80	120
బెండ	60	80
బీర	80	120
గోకర	60	80
ఆలుగడ్డ	40	60
వంకాయ	40	60
సొరకాయ(ఒకటి)	20	30
క్యారెట్	70	100
కీర దోస	40	60
బీన్స్	300	360

ఇంత ధర పెట్టి కొనలేకపోతున్నాం



మార్కెట్‌లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. ఏది కొనాలన్నా కిలో రూ.80కి తక్కువ లేదు. ఇంత ధర పెట్టి కొనాలంటే ఇబ్బందిగా ఉంది. ధరలు తగ్గించాలి. కూలినాలీ చేసుకునే వారి పరిస్థితి మరీ దారుణంగా మారింది.

–సబిత, జీకే అన్నారం, నల్లగొండ మండలం

అన్ని ధరలు పెరిగాయి



నిత్యావసర వస్తువులైన కూరగాయలు, పప్పులు ఇలా అన్ని వస్తువుల ధరలు సామాన్యులకు అందనంత పెరిగిపోయాయి. పప్పులు కిలో రూ.150 నుంచి రూ.200లకు పెరిగింది. కూరగాయలు వ్యాపారులు ఇష్టం వచ్చిన ధరలకు అమ్ముతున్నారు.

– కవిత, నల్లగొండ

కూరగాయలు తక్కువ వస్తున్నాయి



ఎండాకాలం కావడంతో రైతులు కూరగాయలను తక్కువగా పండిస్తారు. మార్కెట్‌కు కూరగాయలు తక్కువగా వస్తున్నాయి. దాంతో ధరలు పెరిగిపోతున్నాయి. వర్షాలు కురిస్తే ధరలు కాస్త తగ్గుతాయి. ఇతర ప్రాంతాల నుంచి కూడా దిగుమతి తగ్గిపోయింది.

–శేఖర్, కూరగాయల వ్యాపారి

క్లుప్తంగా

గొర్రెల మందపై కుక్కల దాడి

- 30కి పైగా గొర్రెలు మృతి



మృతిచెందిన గొర్రెలు

చిట్యాల: గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో 30కి పైగా గొర్రెలు మృతిచెందాయి. ఈ ఘటన చిట్యాల మండలంలోని వెలిమినేడు గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. వివరాలు.. వెలిమినేడు గ్రామానికి చెందిన ఈరటి మల్లేష్ ఆదివారం రాత్రి గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలం వద్ద దొడ్డిలో గొర్రెలను తోలి.. బంధువుల ఇంటికి వెళ్లాడు. దీంతో రాత్రివేళ దొడ్డి వద్ద కాపలా ఎవరూ లేకపోవడంతో కుక్కలు గొర్రెల మందపై దాడి చేశాయి. ఈ దాడిలో సుమారు 30కి పైగా గొర్రెలు మృతిచెందగా, మరో 12 గొర్రెలకు తీవ్రంగా గాయపడ్డాయి. సోమవారం ఉదయం దొడ్డి వద్దకు వెళ్లిన మల్లేష్ గొర్రెలు మృతిచెందినట్లు గుర్తించి పశువైద్య సిబ్బందికి, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చాడు. మృతిచెందిన గొర్రెల విలువ సుమారు రూ.2లక్షలకు పైగా ఉంటుందని బాధితుడు పేర్కొన్నాడు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

నల్లగొండ క్రైం: చేపల వేటకు వెళ్లి చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం సోమవారం లభ్యమైంది. వివరాలు.. నల్లగొండ మండలంలోని చందనపల్లి గ్రామానికి చెందిన కొడదల సైదులు(48) ఆదివారం సాయంత్రం నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని పానగల్ చెరువు (ఉదయ సముద్రం)లో చేపలు పట్టేందుకు వెళ్లగా.. ఈదురుగాలుల వీచడంతో తెప్ప తిరగబడి గల్లంతయ్యాడు. చీకటి పడడంతో ఆదివారం రాత్రి గాలింపు చర్యలకు అంతరాయం కలిగింది. సోమవారం ఉదయం రెస్క్యూ టీమ్ చెరువులో గాలించి సైదులు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. మృతుడి భార్య నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు నల్లగొండ రూరల్ ఎస్ఐ శంకర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

భువనగిరి రూరల్ : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందిన సంఘటన భువనగిరి మండలంలోని అనాజిపురం గ్రామ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు..భువనగిరి మండలంలోని పచ్చర్లబోడు తండాకు చెందిన బానోతు బిక్కునాయక్, భార్య పద్మ(45), కుమార్తె శ్రీవిద్యతో కలిసి తండా నుంచి అనాజిపురం మీదుగా భువనగిరికి బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో నల్లగొండ నుంచి భువనగిరి వైపు వెళ్తున్న కారు అనాజిపురం గ్రామ సమీపంలో ఎదురుగా అతివేగంగా వచ్చి వారి బైక్‌ను ఢీకొట్టడంతో పద్మ అక్కడికక్కడే మృతి చెందింది. బిక్కూనాయక్, కుమార్తె శ్రీవిద్య కు తీవ్ర గాయాలు కాగా భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. బిక్కూ పరిస్థితి విషమంగా ఉండడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలి పారు. పద్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

హుజూర్‌నగర్‌రూరల్ : ఉరేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన గోపాలపురంలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ బలరాంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన ఆత్కూరి అనంతరావమ్మ (41) భర్తతో విడిపోయి కొన్ని సంవత్సరాలుగా గోపాలపురంలో కుమారుడు గోపాలకృష్ణతో కలిసి జీవిస్తోంది. కాగా ఇటీవల కుమారుడు అనారోగ్యానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో మనోవేదనకు గురైన అనంతరావమ్మ సోమవారం బాత్‌రూంలో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు వివరించారు. ఆమె చెల్లెలు రెగ్లరేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఓటేసిన ప్రముఖులు



నల్లగొండ పట్టణంలో ఓటు వేసిన కలెక్టర్ హరిచందన



నల్లగొండలో ఓటు వేస్తున్న అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్



సూర్యాపేటలో ఓటు వేసిన కలెక్టర్ ఎస్. వెంకటరావు



యాదగిరిగుట్ట లో ఓటేసిన ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



తుర్కపల్లిలో ఓటు వేసిన కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న దంపతులు



దేవరకొండలో ఓటేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్



తిరుమలగిరి(సాగర్)లో ఓటు వేసిన ఎమ్మెల్సీ కోటిరెడ్డి



వలిగొండలో కుమార్తెతో కలిసి ఓటేసిన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



నకిరేకల్ పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఓటు వేసిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు



నల్లగొండలో ఓటు వేసి సిరా చుక్క చూపిస్తున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



సూర్యాపేటలో ఓటు వేస్తున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి



మునుగోడులో ఓటేసిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ దంపతులు



నల్లగొండలో దివ్యాంగుడిని వీల్‌చైర్‌లో పోలింగ్ బూత్‌లోకి తీసుకెళ్తున్న సిబ్బంది



పెద్దవూరలో ఓటేసేందుకు బారులుదీరిన ఓటర్లు



చిన్నారులతో ఓటు వేయడానికి వచ్చిన మహిళలు



నల్లగొండలో బ్యాలెట్ బాక్స్‌లను డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు తీసుకొస్తున్న పోలింగ్ సిబ్బంది



చిట్యాల జెడ్పీహెచ్ఎస్‌లో ఓటు వేసేందుకు క్యూలైన్‌లో నిల్చున్న యువకులు



పోచంపల్లిలో బారులుదీరిన మహిళా ఓటర్లు



భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్యూలైన్‌లో నిల్చున్న ఓటర్లు



మర్రిగూడ: ఖుదాబక్ష్‌పల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్న దివ్యాంగురాలు



రాజాపేటలో ఓటు వేసేందుకు బారులుదీరిన మహిళా పట్టభద్రులు



చిలుకూరులో నాలుగు గంటల తర్వాత పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఓటరును లోనికి అనుమతించని పోలీసులు

ఎమ్మెల్యేను నిలదీసిన ఓటర్లు



పోలింగ్ బూత్ వద్ద ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని నిలదీస్తున్న ఓటర్లు

బీబీనగర్ : బీబీనగర్‌లోని పోలింగ్ కేంద్రంలోకి సరాసరి కార్యకర్తలతో వెళ్లిన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని ఓటర్లతో పాటు పోలింగ్ బూత్‌లో ఉన్న ఏజెంట్లు, అధికారులు నిలదీశారు. పోలింగ్ బూత్‌లోకి ఎమ్మెల్యే వెళ్తుండగా.. అప్పటివరకు క్యూలైన్‌లో ఉన్న కార్యకర్తలు సైతం ఆయనతో పాటు వెళ్లారు. దీంతో క్యూలైన్ క్రమం తప్పింది. అదేవిధంగా పోలింగ్ బూత్‌లో ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించడం, ఓటర్లను పలకరించడంతో బూత్‌లోని అధికారులు, ఏజెంట్లు ఓటు లేకుండా మీరు ఎలా లోపలికి వస్తారంటూ ఎమ్మెల్యేను నిలదీశారు. దీంతో 'నేను లోపలికి వస్తే తప్పేముంది.. ఏమీ చేయడం లేదు కదా' అంటూ ఎమ్మెల్యే బూత్ నుంచి బయటకు వచ్చేశారు.

స్వతంత్ర అభ్యర్థిపై దాడి ఘటనపై విచారణ



నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న పాలకూరి అశోక్

నార్కట్‌పల్లి, నల్లగొండ క్రైం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ సందర్భంగా సోమవారం నార్కట్‌పల్లిలోని డోకూరి ఫంక్షన్‌హాల్ వద్ద స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్‌పై జరిగిన దాడిపై విచారణ జరుపుతున్నట్లు నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డోకూరి ఫంక్షన్‌హాల్ వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు భోజన ఏర్పాట్లు చేస్తుండగా.. స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్ తన అనుచరులతో అక్కడకు చేరుకుని కాంగ్రెస్ కార్యకర్తలు ఓటర్లకు డబ్బులు పంచుతున్నారని ఆరోపించారని, దీంతో కాంగ్రెస్ కార్యకర్తలు, పాలకూరి అశోక్ అనుచరుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ఈ క్రమంలో అశోక్ అనుచరులు వీడియో తీస్తుండగా జరిగిన పెనుగులాటలో అశోక్‌కు చెందిన రెండు సెల్‌ఫోన్లలో ఒకటి ధ్వంసమైందని, మరొకటి ఫంక్షన్‌హాల్ ఆవరణలో పడిపోయిందన్నారు. దీంతో అశోక్ తన అనుచరులతో కలిసి నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్ వద్ద కాంగ్రెస్ కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని ధర్నా చేసినట్లు తెలిపారు. అశోక్‌పై కాంగ్రెస్ పార్టీ నార్కట్‌పల్లి పట్టణ అధ్యక్షుడు జెర్రిపోతుల భరత్ ఫిర్యాదు చేయగా.. అశోక్ కాంగ్రెస్ నాయకులపై ఫిర్యాదు చేశారని, దీనిపై విచారణ చేస్తున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు.

భర్త ఒక చోట.. భార్య మరో చోట

- పట్టభద్రుల ఓటర్ల జాబితాలో తప్పిదాలు
- ఒకే ఇంటి అడ్రస్‌తో ఓట్లు నమోదు చేసుకున్నా వేర్వేరు పోలింగ్ స్టేషన్లలో భార్యాభర్తల ఓట్లు

నల్లగొండ: వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఓటర్ల జాబితా రూపకల్పనలో జరిగిన పొరపాట్ల కారణంగా భార్యాభర్తలు ఒకే ఇంటి అడ్రస్‌తో ఓట్లు నమోదు చేసుకున్నా వేర్వేరు చోట్ల ఓటు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో కొందరు భార్యాభర్తలు ఒకే అడ్రస్‌తో ఓటు నమోదు చేసుకున్నప్పటికీ ఇరువురికి ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఓట్లు రాలేదు. భర్త ఒక పోలింగ్ కేంద్రంలో, భార్య మరో పోలింగ్ కేంద్రంలో ఓటు వేయాల్సి వచ్చింది. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పట్టభద్రులా మజాకా..

కోదాడ, కోదాడ రూరల్: ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో సోమవారం పోలింగ్ రోజు కోదాడ పట్టణంలో వేర్వేరుగా ఏర్పాటు చేసిన ఆయా పార్టీ టెంట్ల వద్ద ఓటర్లు కొందరు డబ్బుల కోసం ఎగబడ్డారు. విద్యావంతులు, ఉద్యోగులై ఉండి డబ్బులకు ఆశపడటం ఏమిటి, ముగ్గురు అభ్యర్థుల వద్ద తీసుకోవడం ఏమిటని కొందరు ప్రశ్నించారు. డబ్బులు మేము అడిగామా..అభ్యర్థులు ఇస్తేనే కదా తీసుకున్నది. ముగ్గురి వద్ద డబ్బులు తీసుకొని ముగ్గురికీ ప్రాధాన్యతా క్రమంలో ఓటు వేసి న్యాయం చేశామని సమర్థించుకున్నారు. కొందరు ఉద్యోగులైతే మాస్కులు ధరించి ఆయా టెంట్ల వద్దకు వెళ్లి డబ్బులు తీసుకున్నారు.

పోలింగ్ కేంద్రం వద్ద వికలాంగురాలి నిరసన



పోలింగ్ కేంద్రం వద్ద సైదమ్మ

నకిరేకల్: నకిరేకల్‌లోని జడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రంలో ఓ వికలాంగురాలు తనకు ఓటు వేసేందుకు వీల్ చైర్ అందుబాటులో పెట్టలేదని నిరసన తెలిపారు. నకిరేకల్ మండలం నోముల గ్రామానికి చెందిన గర్శకోటి సైదమ్మకు రెండు కాళ్లు లేవు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటు వేసేందుకు స్వగ్రామం నుంచి మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రానికి ప్రత్యేకంగా రూ.300 ఇచ్చి ఆటోలో వచ్చారు. ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లాలంటే నడిచి వెళ్లలేని పరిస్థితి. అధికారులు వీల్‌చైర్ అందుబాటులో పెట్టలేదు. వీల్ చైర్ లేకుండా ఎలా లోపలకు వెళ్లాలని ప్రశ్నించింది. కొద్దిసేపు నిరసన తెలిపింది. ఆ తరువాత నేల మీద నుంచి పాకుకుంటూ ఓటు వేసి వచ్చింది. ఓటు వేసి వచ్చిన తరువాత అధికారులు వీల్‌చైర్ తెప్పించి ఆమెను ఆటోలో ఎక్కించి పంపించారు.

నకిలీ విత్తనాల ముఠా గుట్టురట్టు

మిర్యాలగూడ అర్బన్ : నకిలీ పత్తి విత్తనాలు సరఫరా చేస్తున్న ముఠాకు మిర్యాలగూడ పోలీసులు చెక్ పెట్టారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా పొంగులూరుకు చెందిన పెండ్యాల జగదీశ్వర్‌రావు, మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం సారంగపల్లి గ్రామానికి చెందిన గునుగుంట్ల వీరమణికంఠ, ముంద్రు మల్లికార్జున్, ఎర్లగుంటపల్లి గ్రామానికి చెందిన సాంబశివరావు, పల్నాడు జిల్లా షావిలిపురం మండలం శానంపూడికి చెందిన లారీ డ్రైవర్ శ్రీరంగ ఒక ముఠాగా ఏర్పడి నకిలీ విత్తనాలు సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో ఆరు తెల్లబస్తాల్లో నకిలీ పత్తి విత్తనాలు తీసుకుని ఈ నెల 25వ తేదీన మిర్యాలగూడ వచ్చారు. ఆ బస్తాలను మరో వాహనంలోకి ఎక్కించే క్రమంలో అక్కడికి చేరుకున్న వన్‌టౌన్ పోలీసులు బస్తాలను పరిశీలించి విత్తనాలు ఉన్నట్లు గుర్తించారు. వ్యవసాయ అధికారులకు సమాచారం అందించగా వారు పరిశీలించి నకిలీ విత్తనాలుగా నిర్ధారించారు. ఈ సమయంలో అక్కడ ఉన్న వ్యక్తి పరారు కావడంతో వ్యవసాయ అధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బస్తాల వద్ద వదిలిన మరో సంచిలో ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా పరారైన వ్యక్తిని గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడితో ముఠాలోని మిగతా సభ్యులకు ఫోన్ చేయించి విత్తనాలు వచ్చాయని అందరూ రావాలని చెప్పించారు. సోమవారం మిర్యాలగూడకు వచ్చిన నిందితులను అరెస్టు చేశామని, మరొకరు పరారీలో ఉన్నాడని తెలిపారు. స్వాధీనం చేసుకున్న నకిలీ విత్తనాలు 250 కిలోలు ఉండగా వాటి విలువ రూ.5 లక్షలు ఉంటుందని డీఎస్పీ తెలిపారు.

వీడిన యువకుడి హత్యకేసు మిస్టరీ

- వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ రాహుల్‌హెగ్డే



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాహుల్‌హెగ్డే

సూర్యాపేటటౌన్ : నందికొండ వెంకన్న అలియాస్ వెంకటేష్ అనే యువకుడి హత్య కేసును పోలీసులు ఛేదించారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. సంఘటనకు సంబంధించిన వివరాలను సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఎస్పీ రాహుల్‌హెగ్డే వెల్లడించారు. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన నందికొండ సైదులు కుమారుడైన నందికొండ వెంకన్న టేకుమట్లలోని తన బంధువుల ఇంట్లో నివాసం ఉంటూ ఓ ప్రైవేట్ హౌస్ లోన్ ఫైనాన్స్ ఆఫీస్‌లో పని చేస్తున్నాడు. ఈ నెల 23న ఉదయం 8గంటల సమయంలో టేకుమట్ల నుంచి సూర్యాపేటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు వెతకగా వెంకన్న మోటార్ సైకిల్ రాయినిగూడెం గ్రామ శివారులోని రాజుగారి తోట ఎదురుగా హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే రోడ్డు పక్కన పడి ఉంది. బంధువులు వెంటనే ఫిర్యాదు చేయగా సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. దర్యాప్తులో భాగంగా పోలీసులు మూడు టీంలను ఏర్పాటు చేసి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లను రప్పించి కేసు మిస్టరీని ఛేదించారు. మృతుడు నందికొండ వెంకన్న 2022 సంవత్సరంలో తన స్నేహితుడైన బెజవాడ రాజశేఖర్‌ను డబ్బుల పంచాయితీ విషయంలో హత్య చేశాడు. అప్పట్లో జైలుకు వెళ్లి తిరిగి వచ్చిన వెంకన్న.. బెజవాడ రాజశేఖర్ కుటుంబ సభ్యులతో తనకు ప్రాణహాని ఉందని టేకుమట్లలోని తన పెద్దమ్మ ఇంట్లో ఉంటున్నాడు. అయితే రాజశేఖర్ హత్యకు ప్రతీకారంగా నందికొండ వెంకన్నను హతమార్చేందుకు రాజశేఖర్ సొంత అన్న బెజవాడ రమేష్ పథకం రచించాడు. నందికొండ వెంకన్న మరో స్నేహితుడైన ఖమ్మంపాటి సైదులు సాయంతో వెంకన్న టేకుమట్లలో ఉంటున్నట్టు తెలుసుకున్నారు. వెంకన్నను చంపేందుకు పలుమార్లు రెక్కి నిర్వహించారు. 2022లో మే నెలలోనే తన తమ్ముడిని చంపాడని.. ఎలాగైనా ఇదే నెలలో హత్య చేయాలని రమేష్ భావించాడు. ఈ నెల 23న సైదులుతో కలిసి నందికొండ వెంకన్నను హత్య చేసేందుకు బెజవాడ జానయ్యకు, బోడ సతీష్ కుమార్, ఇస్లావత్ సురేష్‌లకు చెప్పగా వారు ఒప్పుకున్నారు. ఈ నెల 23న ఉదయం ఖమ్మంపాటి సైదులు తన మహేంద్ర సుప్రో వెహికిల్‌లో రమేష్, ఖమ్మంపాటి సైదులు, బోడ సతీష్ కుమార్, ఇస్లావత్ సురేష్, బెజవాడ జానయ్యలు టేకుమట్ల క్రాస్ రోడ్డు వద్ద రెక్కి నిర్వహించారు. వెంకన్న తన మోటార్ సైకిల్‌పై సూర్యాపేటకు వెళ్తుండగా వెంబడించి రాజు గారి తోట ఎదురుగా మ హేంద్ర సుప్రో వాహనంతో వెనుక నుంచి ఢీకొట్టడంతో వెంక న్న మోటార్ సైకిల్‌పై నుంచి కిందపడిపోయాడు. వెంకన్నను వాహనంలోకి బలవంతంగా ఎక్కించుకుని మోతె గ్రామ శి వారులోకి తీసుకెళ్లి తాడుతో వెంకన్న మెడకు బిగించి హత్య చే శారు. అక్కడే ఉన్న కట్టెలను శవంపై వేసి పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఈ కేసులో మొదటి ముద్దాయి అయిన కట్టంగూరు మండలం రసూల్‌గూడెంకు చెందిన బెజవాడ రమేష్‌ను ఈ నెల 26న పట్టుకొని జుడీషియల్ రిమాండ్‌కు పంపించినట్టు వివరించారు. మిగతా నలుగురిని సోమవారం రిమాండ్‌కు తరలించినట్టు పేర్కొన్నారు. కేసును ఛేదించిన సూర్యాపే ట ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎస్పీ జి.రవి, సీఐ వై.సురేందర్‌రెడ్డి, సూర్యాపేట రూరల్ ఎస్ఐ బాలు నాయక్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

నడిగూడెం: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మంగళవారం నుంచి వచ్చేనెల 6వ తేదీ వరకు అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మొలుగూరి సతీష్, పండిటి వంశీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.15,116, ద్వితీయ బహుమతి రూ.12,116, తృతీయ బహుమతి రూ.10,116 నగదు, షీల్డుతోపాటు ప్రతిభ చూపిన క్రీడాకారులకు ప్రత్యేక బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9505924550 లేదా 9182115126 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

బైక్ దొంగల ముఠా అరెస్టు

- 67 బైక్‌లు, 5 సెల్‌ఫోన్లు బొమ్మ పిస్తోలు స్వాధీనం
- రాత్రిపూట ఇంటి ఎదుట నిలిపిన బైక్‌లే లక్ష్యంగా చోరీ
- తెలంగాణలో చోరీ చేసినవి ఏపీలో..
- ఏపీలో చోరీ చేసిన బైక్‌లు తెలంగాణలో అమ్మకం



వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ

నల్లగొండ క్రైం: బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను పోలీసులు పట్టుకుని వారి వద్ద రూ.90 లక్షల విలువైన 67 బైక్‌లు, బొమ్మ పిస్తోలు, 5 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ రాములునాయక్‌తో కలిసి ఎస్పీ చందనా దీప్తి వివరాలు వెల్లడించారు.

నిందితులకు జైలులో పరిచయం

నిందితులకు జైలులో పరిచయం కావడంతో జైలు నుంచి విడుదలైన తర్వాత సులభంగా డబ్బులు సంపాదించాలని ఒక ముఠాగా ఏర్పడ్డారు. ఐదుగురు సభ్యులు కలిగిన పాత నేరస్తులు రాత్రి పూట ఇళ్ల ఎదుట పార్కు చేసిన బైక్‌లను లక్ష్యంగా చేసుకుని ఐదు నెలల కాలంలో 67 బైక్‌లు చోరీ చేశారు. తెలంగాణలో చోరీ చేసిన బైక్‌లను ఏపీలో విక్రయించారు. ఏపీలో చోరీ చేసిన బైక్‌లను డబ్బులు అవసరమున్నాయంటూ తక్కువ ధరకు తెలంగాణలో విక్రయించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తిప్పర్తి, మిర్యాలగూడ, నార్కట్‌పల్లి, నకిరేకల్, నల్లగొండ, సూర్యాపేట, భువనగిరి ప్రాంతాల్లో బైక్‌లను చోరీ చేశారు. అలాగే ఏపీలోని పిడుగురాళ్ల, దాచేపల్లి, చిలకలూరి పేట, ఎడ్లపాడ్, మంగళగిరి, గుంటూరు ప్రాంతాల్లో చోరీ చేసి తక్కువ ధరకు బైక్‌లను విక్రయించారు.



ముగ్గురు వ్యక్తుల ఫిర్యాదుతో..

నల్లగొండ పట్టణంలో ముగ్గురు వ్యక్తులు బైక్‌లు పోయినట్లు జనవరిలో నల్లగొండ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ నాగరాజు నేరస్తుల కోసం ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసి టెక్నాలజీని వినియోగించుకుని గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాల పుటేజీ, సెల్ టవర్ లొకేషన్ ఆధారంగా నేరస్తులను గుర్తించారు.

ఇలా పట్టుబడ్డారు..

పోలీస్ బృందం పానగల్ బైపాస్‌లో సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ముఠాసభ్యులు కనిపించారు. వారి వద్ద బొమ్మ పిస్తోలు లభించింది. పోలీసులు వారిని అరెస్ట్ చేసి విచారించగా బైక్‌ల దొంగతనం చేస్తున్నట్లు నేరం అంగీకరించారు. నిందితులు 20 బుల్లెటు బైక్‌లు, 44 పల్సర్ బైక్‌లు, ఒక టీవీఎస్ అపాచి, ఒక యాక్టివా, సీడీ డీలక్స్ బైక్‌లు చోరీ చేశారు. కేసు పరిశోధనలో కీలక పాత్ర పోషించిన ఎస్ఐ నాగరాజు, పోలీస్ సిబ్బంది విష్ణువర్ధన్‌గిరి, లావూరి బాలకోటి, లింగస్వామి, మహేష్‌లకు ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. ఈ సమావేశంలో డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐ డానియెల్ పాల్గొన్నారు.

నేరస్తులు వీరే..

పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన తుపాకుల వెంకటేష్, కనిగిరి గ్రామానికి చెందిన గువ్వల శబరీష్, చిలకలూరిపేటకు చెందిన గుంజి అంకమ్మ రావు, పిడుగురాళ్ల మండలం జానపాడ్‌కు చెందిన మెట్టుపల్లి శ్రీకాంత్, చిలకలూరిపేట మండలం కావూరు గ్రామానికి చెందిన ఆవుల వేణులు పాత నేరస్తులు. వీరికి జైలులో పరిచయమైంది. మెట్టుపల్లి శ్రీకాంత్, గంజి అంకమ్మరావు ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చారు. అంతకు ముందే మిగతా వారు జైలునుంచి బయటకు వచ్చారు. గువ్వల శబరీష్ బైక్ చోరీ చేసే సమయంలో ఎవరైనా అడ్డగిస్తే బొమ్మ పిస్తోలుతో బెదిరించేవాడు.



పట్టుబడిన నిందితులు